పారదర్శకంగా టీడీపీ సంస్థాగత ఎన్నికలు

- 25 మంది పార్లమెంట్ అధ్యక్షుల నియామకం
- ఏపీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- వైసీపీది ఫేక్ ప్రచారం: మంత్రి నిమ్మల

విశాఖపట్నం, ఆంధ్రప్రభ బ్యూరో: తెలుగుదేశం పార్టీలో అన్ని ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని ఏపీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి నిమ్మల రామా నాయుడు, ఇతర పార్టీ శ్రేణులతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి టీడీపీలో అవకాశం ఉంటుందన్నారు. పార్టీ ప్రయోజనాలకు, సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నవారిని సెలెక్ట్ చేస్తున్నామన్నారు. దేశంలో 1200 పార్టీలున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 మంది పార్లమెంట్ అధ్యక్షులను నియమిస్తామని చెప్పారు. రాష్ట్రనీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు మాట్లాడుతూ టీడీపీలో వార్డు అధ్యక్షుడు నుంచి జాతీయ అధ్యక్షుడు వరకూ పారదర్శకంగా ఎన్నిక జరుగుతుందన్నారు. వైఎస్ విజయమ్మను అధ్యక్షురాలు పదవి నుంచి తొలగించేందుకు వైసీపీ ఓసారి ప్లీనరీ ఏర్పాటు చేసి మరీ డ్రామాకు తెరతీసిందన్నారు. టీడీపీకి ప్రతి రెండేళ్లకోసారి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయన్నారు. పార్టీ పదవుల ఎంపికకు సంబంధించి అందరి విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తుందని మంత్రి వివరించారు. కూటమి ప్రభుత్వస్వచ్ఛ పాలన వల్ల వైసీపీలో గుబులు రేగుతుందన్నారు. ప్రజల్లో అశాంతిని కలిగించేందుకు వైసీపీ ఫేక్ ప్రచారంకు పాల్పడుతోందని విమర్శించారు. మానవత్వం లేని జగన్ విష ప్రచారం చేయిస్తున్నాడని మరో వైపు స్టీల్‌ప్లాంట్‌పై కూడా అదే జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొకలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రూ. 14,500 కోట్ల నిధుల్ని తెచ్చి చంద్రబాబు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు బ్రేక్ వేశారని వివరించారు. డిఎస్సి నియామకంపైనా జగన్ అయోమయం కలిగిస్తున్నాడన్నారు. బొమ్మలు లేని బుక్స్‌ను మంత్రి లోకేష్ పిల్లలకు అందిస్తున్నారని ఆరోపణలు గుప్పిస్తున్న వైకాపా శాసనసభ్యులు, ఆ పార్టీ అధినేత జగన్‌కి అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేదని దుయ్యబట్టారు. వస్తే స్వాగతిస్తామన్నారు.ఈ సమావేశంలో విశాఖ లోక్ సభ సభ్యులు ఎం శ్రీ భరత్, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు, మేయర్ పీలా శ్రీనివాసరావు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు శాసన మండలి సభ్యులు పరిశీలకులు శ్రీరాంరెడ్డి గోపాల్ రెడ్డి, విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కురుపూడి సత్తిబాబు, శాసనమండలి మాజీ సభ్యులు దువ్వారపు రామారావు, కోరాడ రాజబాబు పాల్గొన్నారు.

యువతకు ఇచ్చిన హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

- ఏపీఎన్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

అమరావతి, ఆంధ్రప్రభ: యువతకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించి చిత్తశుద్ధిని నిరూపించుకుందని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ఇక ప్రతి ఏటా మెగా డీఎస్సీ నిర్వహించి, యువ ఉపాధ్యాయులతో రాష్ట్ర విద్యారంగాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకువెళుతోందని తెలిపారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో గత 14 నెలలుగా విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలవుతున్నాయని అన్నారు.విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్టూడెంట్-టీచర్ రేషియో ను సమతుల్యం చేసేందుకు ఉపాధ్యాయ నియామకాలు కీలకమని నమ్మే లోకేష్, యువత కలలను నిజం చేశారని, సీఎం చంద్రబాబు తమ 14 ఏళ్ల పాలనలో 13 డీఎస్సీల ద్వారా 1,96,619 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి చరిత్రసృష్టించారని, ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయుల్లో అధికశాతం ఆయన హయాంలో నియమితులైన వారేనని తెలిపారు. ఇక గత ప్రభుత్వం మెగా డీఎస్సీ హామీ ఇచ్చి, ఒక్క పోస్టు కూడా భర్తీ చేయకుండా విద్యారంగాన్ని నాశనం చేసిందని విమర్శించారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలాగా నిలబెట్టడం, మరుగుదొడ్లు శుభ్రం చేయించడం, ఎన్నికల విధుల నుంచి తప్పించడం, మధ్యాహ్న భోజన పథకం బాధ్యతలు అప్పగించడం వంటి చర్యలతో ఉపాధ్యాయుల గౌరవాన్ని దెబ్బతీశారని విమర్శించారు. కోడిగుడ్ల సరఫరాలో జాప్యం జరిగినప్పుడు ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో అనేక చర్యలు చేపట్టిందని ఆయన వివరించారు. సమగ్ర శిక్షా సొసైటీ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో 729 నాన్-టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీ చేయడం తో పాటు 90 మంది ఎస్టీ యువతను కొత్తగా ఉపాధ్యాయులుగా నియమించడం జరిగిందని తెలిపారు.700 కోయ భారతి టీచర్ పోస్టుల భర్తీ, 476 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,619 కాంట్రాక్టు లెక్చరర్ల సేవల పునరుద్ధరణ వంటి చర్యలు తీసుకున్నారని కొనకళ్ళ నారాయణ వెల్లడించారు.

దాతలు స్పందించారు.. జ్యోతికి అండగా నిలిచారు

- చికిత్సకు ముందుకొచ్చిన ఎన్టీఆర్ వైద్యసేవ
- త్వరగా కోలుకోవాలంటూ దాతల ఆకాంక్ష
- విరాళాల రూపంలో ఇప్పటిదాకా రూ. 27,500
- ఆంధ్రప్రభ కథనానికి స్పందన

అమరావతి, ఆంధ్రప్రభ: దాతృత్వం వెల్లివిరిసింది. మేమున్నామంటూ ఓ మాతృ మూర్తికి భరోసాగా నిలిచేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్ బోరబండ లో కదల్లేని స్థితిలో వైద్యం చేయించు కోవడానికి స్తోమత లేక అల్లాడుతున్న బొమ్మాళి జ్యోతి (33) దైన్యంపై మంగళ వారం ఆంధ్రప్రభలో 'మా అమ్మను నడిపిం చండి' శీర్షికతో ప్రచురితమైన కథనానికి పాఠక దేవుళ్లు స్పందించారు. ఆమెకు తక్షణమే మందులు కొనుగోలు చేసేందుకు ఆర్థికసాయం అందించారు. పలువురు జ్యోతిని ఫోన్లో పరామర్శించారు. ధైర్యం నింపారు. తమ వంతు సాయంగా కొంతమేర నగదు అందించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ రూ. 27,500లు బాధితురాలి ఖాతాలో జమచేశారు.

దాతల వివరాలివీ..

పేరు	అందించిన నగదు(రూ.లలో)
కంటిపూడి శర్వానంద్	9,000
వాచస్పతి సుధాకర్	5,116
ఎ.రమేశ్‌కుమార్	2,000
కె.మహేశ్వరరెడ్డి, ఏఈ, ఎస్సార్బీసీ	2,000
పుట్టా అప్పారావు	1,000
రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, విజయవాడ	1000
కావేటి నర్సరీ	1,000
ఇతరులు	6,500

చికిత్సకు ముందుకువచ్చిన ఎన్టీఆర్ వైద్యసేవ

బొమ్మాళి జ్యోతి ఆరోగ్య పరిస్థితిపై ఆంధ్రప్రభలో ప్రచురితమైన కథనానికి ఎన్టీఆర్ వైద్యసేవా విభాగం స్పందించింది. సంబంధిత శాఖకు చెందిన గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ విజయ్ ప్రకాశ్ జ్యోతికి ఫోన్ చేశారు. ఆమె సమస్యను అడిగి వివరాలు తెలుసుకున్నారు. హైదరాబాద్ నుంచి వస్తే తగిన విధంగా పరీక్షలు చేసి ఉచిత చికిత్స అందిస్తామంటూ భరోసా అందించారు. తనకు అండగా నిలిచిన ఆంధ్రప్రభకు జ్యోతి కృతజ్ఞతలు తెలిపింది.

అమరావతిలో అత్యాధునిక విద్యుత్ వ్యవస్థ

- తాళ్లాయిపాలెంతోపాటు మరో రెండు సబ్‌స్టేషన్లు
- అవాంతరాలు లేని విద్యుత్ సరఫరా లక్ష్యం
- రూ. 1000 కోట్లతో అండర్‌గ్రౌండ్ కేబుల్స్ ఏర్పాటు
- రాజధాని ప్లాట్స్‌కు ఇబ్బంది లేకుండా రీ రూటింగ్ పనులు
- రెండేళ్లల్లో పూర్తిచేయడమే లక్ష్యం
- పది ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ఏపీసీపీడీసీఎల్ చర్యలు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణంలో అత్యాధునిక విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఎటువంటి ఆటంకం లేని విద్యుత్ అందించే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించింది. నూతన రాజధానికి అవసరమయ్యే డిమాండ్‌ను ముందుగానే ఊహించి అందుకనుగుణంగా సరఫరా వ్యవస్థను మెరుగు పరిచేదిశగా చర్యలు చేపట్టింది. ప్రధానంగా ఇప్పటికే అమరావతి నుంచి వెళ్లే 400 కేవీ విద్యుత్ లైన్లతో పాటు టవర్స్‌ను తొలగించి భూగర్భ కేబుల్స్ ఏర్పాటుచేయాలని భావిస్తోంది. ఇప్పటికే ఈ పనులకు శ్రీకారం చుట్టింది. వీటికోసం సీఆర్‌డీఏ సుమారు రూ. 1000 కోట్లను ఖర్చు చేసేందుకు సైతం సిద్ధమైంది. ఎంత త్వరగా ఈ పనులు పూర్తయితే ఇతర అభివృద్ధి పనులకు అంత త్వరగా మోక్షం కలగనుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

రూ. 1000 కోట్లతో రీ రూటింగ్

ప్రస్తుతం విజయవాడ నుంచి పొదిలి, నరసరావుపేట, రెంటచింతల ప్రాంతాలకు వెళ్లే 220 కేవీ విద్యుత్ లైన్లు అమరావతి మీదుగా వెళ్తున్నాయి. అమరావతి ప్రాంతంలో అనేక గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనుల నిర్వహణకు ఈ కేబుల్స్ అవాంతరంగా మారాయి. దీనికితోడు అనేకప్లాట్స్‌లో భారీ కేబుల్ టవర్స్ ఉండడం వల్ల ఆ ప్లాట్లను అభివృద్ధి చేసే అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి పరిసర ప్రాంతాల్లోనుంచి వెళ్లే విద్యుత్ లైన్లను అండర్ గ్రౌండ్ వ్యవస్థరూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు పలు సమీక్ష సమావేశాలు నిర్వహించి లోటుపాట్లు, సాధ్యాసాధ్యాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. రాజధాని ప్రాంతాల్లో ఉన్న టవర్లను తొలగించి ఆ కేబుళ్లను భూగర్భ కేబుల్ వ్యవస్థ ద్వారా ఏర్పాటుచేసేందుకు ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించారు. ఈమేరకు అంచనాలను రూపొందించడంతో పాటు బడ్జెట్ కూడా కేటాయించారు. ఈ పనులకు సుమారు రూ. 1000 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈమేరకు టెండర్లను పిలిచి పనులను సైతం అప్పగించారు. రెండు క్లస్టర్లుగా విభజించి పలు సంస్థలకు వీటిని కేటాయించారు. రానున్న రెండేళ్లల్లో వీటిని పూర్తిచేయాలన్న నిబంధన విధించారు. ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమైన ఈ పనులు 2027 జూన్‌కి పూర్తిచేయాలని కాంట్రాక్టు సంస్థకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

కరకట్ట నుంచి...

ముఖ్యంగా ఈ పనులు కృష్ణా కరకట్ట నుంచి రాయపూడి మీదగా సీఆర్‌డీఏ పరిధిలోని ప్రాంతాల వరకు చేపట్టనున్నారు. 220 కేవీ 4 విద్యుత్ లైన్లు ఈ మార్గంలో నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయి. ప్రస్తుతం వీటి టవర్లను తొలగించి కేబుల్స్‌ను భూగర్భ వ్యవస్థలో ఏర్పాటుచేసే దిశగా చర్యలు చేపట్టారు. ఈ పనులకు సుమారు 1000 కోట్లు ఖర్చు కానుంది. రెండేళ్లలోపు వీటిని పూర్తిచేయాల్సి ఉంటుంది. ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటికి సీఆర్‌డీఏ ఆర్థిక సాయంతో చేపట్టారు.

రీరూటింగ్ పనులు

నున్న నుంచి నెల్లూరు పవర్‌గ్రిడ్‌కు వెళ్లే 400 కేవీ 3 లైన్స్‌ను కూడా మార్పు చేయనున్నారు. విజయవాడ నుంచి సత్తెనపల్లి వెళ్లే హెచ్‌పీ లైన్ల పనులు కూడా చేపట్టారు. అదేవిధంగా ఉద్దండరాయనిపాలెం, వెంకటపాలెం, వెన్నె బైపాస్ మీదగా రీ రూటింగ్ పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా ఉన్న టవర్స్‌తోపాటు విద్యుత్‌లైన్లను క్రమపద్ధతిలో ఏర్పాటుచేసే దిశగా చర్యలు తీసుకున్నారు. కేవలం అమరావతి ప్రాంతంలోనే అండర్ గ్రౌండ్ వ్యవస్థలో లైన్స్ ఏర్పాటుచేస్తారు. మిగిలిన ప్రాంతాల్లో సక్రమ పద్ధతిలో ఉండి ఆకర్షణీయంగా రూపొందించనున్నారు.

మూడు సబ్ స్టేషన్లు

రాజధాని విద్యుత్ అవసరాలకు తట్టుకునేందుకు మూడు సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఇంధన శాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన 400/220 కేవీ తాళ్లాయిపాలెం సబ్‌స్టేషన్‌ను గతేడాది నవంబరులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లాంఛనంగా ప్రారంభించారు. దీంతోపాటు నేలపాడు, లింగాయపాలెం గ్రామాల్లో మరో రెండు సబ్ స్టేషన్ల

గడువులోగా పనులు పూర్తి

రీ రూటింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాం. ముఖ్యంగా రాజధాని ప్లాట్లకు అడ్డంగా ఉన్న టవర్లను తొలగించి లబ్ధిదారులకు వాటిని అందజేసే ఉద్దేశంతో పనులను వేగవంతం చేస్తున్నాం. సుమారు రూ. 1000 కోట్లతో చేపట్టిన ఈ పనులు రెండేళ్లల్లో పూర్తిచేస్తాం. పనుల వేగవంతానికి సీఆర్‌డీఏ చక్కటి సహకారాన్ని అందిస్తోంది. భవిష్యత్ తరాల అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ట్రాన్స్‌కో ముందుకు వెళ్తోంది.

- సీహెచ్. వాసు, ఈఈ, కె.శ్రీనివాసరావు, డీఈఈ, ట్రాన్స్‌కో

నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నేలపాడు హైకోర్టు భవనాలకు సమీపంలో 220/33కేవీ సామర్థ్యంతో సబ్ స్టేషన్ పనులకు ట్రాన్స్‌కో శ్రీకారం చుట్టింది. సుమారు 250 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న ఈ సబ్‌స్టేషన్ పనులు 18 నెలల్లో పూర్తి చేయాలని నిర్మాణ సంస్థను ఆదేశాలిచ్చింది. ఇప్పటికే టెండర్ పనులు పూర్తయ్యాయి. దీంతో నిర్మాణ పనులు సైతం ప్రారంభమయ్యాయి. అదేవిధంగా లింగాయపాలెంలో కూడా 220/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మించేందుకు ట్రాన్స్‌కో ప్రణాళికలు రూపొందించింది. సుమారు రూ.220 కోట్లతో చేపట్టే ఈ సబ్‌స్టేషన్ పనులు కూడా 18 నెలల్లో పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. ఈ రెండు సబ్ స్టేషన్లు పూర్తయితే తాళ్లాయిపాలెం నుంచి అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ సబ్‌స్టేషన్స్ పూర్తయితే ఏపీసీపీడీసీఎల్ కూడా పది ప్రాంతాల్లో 33 కేవీ సబ్ స్టేషన్లను ఏర్పాటుచేసే దిశగా చర్యలు చేపట్టింది. వీటిద్వారా విద్యుత్ పంపిణీ చేయాలని భావిస్తోంది. కాగా ఇప్పటివరకు రాజధాని ప్రాంత ప్రజల అవసరాలకు తాడికొండ, తాడేపల్లి నుంచి విద్యుత్‌ను వినియోగించాల్సి వస్తోంది. ఈ సబ్‌స్టేషన్లు పూర్తయితే ఎటువంటి అవాంతరాలు లేని విద్యుత్ రాజధాని ప్రాంత ప్రజలకు అందుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఎస్సీ,ఎస్టీ విద్యార్థులను అభినందించే

సంస్కారంలేని పెత్తందారు జగన్

- ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

అమరావతి, ఆంధ్రప్రభ: కూటమి పాలనలో దళిత, పేద విద్యార్థుల్లో సంతోషం వెల్లివిరుస్తోందని, వారి ఆత్మగౌరవం, భవిష్యత్‌పై కొత్త ఆశలు చిగురిస్తున్నాయని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ.. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన ఆశ యాలకు అను గుణంగా కూటమి ప్రభుత్వం విద్యను అంది స్తోంద న్నారు.సీఎం చంద్ర బాబు గురుకుల పాఠశాలల్లో కష్టపడి చదివి ఐఐటీ, నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షల్లో రాణించిన 55 మంది ప్రతిభా వంతులైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.లక్ష బహు మతి అందజేశా రన్నారు. గురు కులాల్లో చదువుతున్న 1,17, 600 మంది విద్యార్థులు ఎస్ఎస్‌సీలో 89.5 శాతం, ఇంటర్‌లో 94.2 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

అలాగే నీట్ పరీక్షలో 31 మంది విద్యార్థు లు ర్యాంకులు సాధించడం ఈ విద్యా విధానం ఎంత సమర్థ వంతమైందో స్పష్టం చేస్తుందన్నారు. ఈ ఏడాది 1500 మంది విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయా లని సీఎం చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. దళిత విద్యార్థుల విజయాలపై మాజీ సీఎం జగన్ ఒక్క ట్వీట్ కూడా చేయలేదని విమర్శించారు.

సెప్టెంబర్ 7వ తేదీ 12 గంటల పాటు శ్రీవారి ఆలయం మూసివేత

- చంద్రగ్రహణం 7వ తేదీ మధ్యాహ్నం 3.30 నుంచి 8వ తేదీ ఉదయం 3 గంటల వరకు

తిరుమల ప్రతినిధి,(ఆంధ్రప్రభ) : సెప్టెంబర్ 7వ తేదీ సాయంత్రం 3.30 గంటల నుంచి సెప్టెంబర్ 8వ తేదీ ఉదయం 3 గంటల వరకు చంద్రగ్రహణం కారణంగా దాదాపు 12 గంటల పాటు తిరుమల శ్రీవారి ఆలయం మూసివేయనున్నారు. సెప్టెంబర్ 7వ తేదీ ఆదివారం రాత్రి 9.50 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై సెప్టెంబర్ 8న సోమవారం వేకువజామున 1.31 గంటలకు పూర్తవుతుంది. సాధారణంగా గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. సెప్టెంబర్ 8న ఉదయం 3 గంటలకు సుప్రభాతంతో ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహ వచనం నిర్వహిస్తారు. అనంతరం తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించనున్నారు. కాగా ఉదయం 6 గంటలకు శ్రీవారి దర్శనం భక్తులకు పునఃప్రారంభవుతుంది. ఈకారణంగా సెప్టెంబర్ 7వ తేదీ ఆదివారం ఊంజల్‌సేవ, అర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలను టిటిడి రద్దు చేసింది. అలాగే సెప్టెంబర్ 7వ తేదీ ఆదివారం సాయంత్రం 3 గంటల నుంచి తిరుమలలో అన్నప్రసాద వితరణ ఉండదు. తిరిగి సెప్టెంబర్ 8వ తేదీ ఉదయం 8.30 గంటలకు అన్నప్రసాద పంపిణీ పునఃప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, ఎస్వి ఉద్యోగుల క్యాంటీన్, పద్మావతి విశ్రాంతి భవనం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2, పిఏసి-2 లలో అన్నప్రసాద వితరణ ఉండదు. భక్తుల సౌకర్యార్థం ముందస్తుగా టిటిడి అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో 30 వేల పులిహోర ప్యాకెట్లను సెప్టెంబర్ 7న సాయంత్రం 4.30 గంటలనుంచి పంపిణీ చేయనున్నారు. ఇందులో భాగంగా శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న వైభవోత్సవ మండపం, రామ్‌భగీచా, పిఏసి-1, సిఆర్‌వో, ఏఎన్సి ప్రాంతాల్లోని ఫుడ్‌కౌంటర్లు, శ్రీవారి సేవా సదన్ వద్ద భక్తులకు అన్నప్రసాదప్యాకెట్లను అందిస్తారు. శ్రీవారి భక్తులు ఈ విషయాలను గమనించి తమ తిరుమల యాత్ర ప్రణాళికను రూపొందిం చుకోవాల్సిందిగా టిటిడి ఒక ప్రకటనలో కోరింది.

భూమన కరుణాకర్ రెడ్డికి దేవుడంటే భక్తిలేదు.. భయంలేదు

- టీటీడీపై బురద జల్లితే ఊరుకోం
- తుడా చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి హెచ్చరిక

తిరుపతి ప్రతినిధి టీటీడీ (ఆంధ్రప్రభ): దేవుడంటే భయం లేదు.. భక్తి అసలే లేని కరుణాకర్ రెడ్డి కోట్ల మంది భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా టీటీడీపై బురద జల్లడం మానుకోవాలని తుడా చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి సూచించారు. టీటీడీ చైర్మన్ బి.ఆర్ నాయుడు, సహచర బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, పనబాకలక్ష్మిలతో కలిసి తుడా చైర్మన్ టిటిడి బోర్డు సభ్యులు దివాకర్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. దేవలోక్ నిర్మాణం చేపట్ట దలచిన అజయ్ కుమార్ అనే వ్యక్తిని గత ప్రభుత్వ పెద్దలు గన్‌తో బెదిరించి 20 ఎకరాల భూమిని వెనక్కు తీసుకొని ముంతాజ్ హోటల్ కు ఇచ్చారని గుర్తు చేశారు. నేడు ఆ వ్యక్తులే మా కూటమి ప్రభుత్వంపై, టీటీడీపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. తమ టిటిడి బోర్డు ఏర్పడిన తర్వాత సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సంతృప్తికర దర్శనం కల్పిస్తూ అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి రూమ్ లో కెమెరా ముందు కూర్చుని టీటీడీపై బురద జల్లాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. చేసిన తప్పులకు పశ్చాత్తాపం పడుతూ గోవింద నామస్మరణ చేసుకోవాలని హితావు పలికారు.. అనేక తప్పుడు నిర్ణయాలతో టిటిడి ప్రతిష్టను అప్రతిష్ట పాలు చేసిన వ్యక్తి నేడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

మలుపు తిరుగుతున్న వైష్ణవి హత్య కేసు

- పక్కా ఆధారాల కోసం పోలీసుల వేట
- నార్కో అనాలసిస్ టెస్ట్‌కు ప్రయత్నం
- జమ్మలమడుగు కోర్టులో కుటుంబ సభ్యుల విచారణ

కడప, ఆంధ్రప్రభ బ్యూరో: గండికోట మిస్టరీని ఛేదించేందుకు పోలీసులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇంటర్ విద్యార్థిని వైష్ణవి హత్య కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. పక్కా ఆధారాల కోసం చేస్తున్న కృషిలో భాగంగా మంగళవారం అనుమానితులను జమ్మలమడుగు కోర్టులో పోలీసులు ప్రవేశపెట్టారు. వైష్ణవి హత్య కేసులో నిజాలు రాబట్టేందుకు కోర్టు అనుమతి కోసం నార్కో అనాలసిస్ టెస్ట్‌కు పోలీసులు వైష్ణవి కుటుంబ సభ్యులు కొండయ్య, సురేంద్ర, వైష్ణవి ప్రియుడు లోకేష్‌లను కోర్టులో ప్రవేశపెట్టారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం పర్యాటక ప్రాంతమైన గండికోటలో గత నెల 14న వైష్ణవి అనే ఇంటర్ విద్యార్థిని హత్యకు గురైన విషయం విధితమే. జమ్మలమడుగు కోర్టులో అనుమానితులను ఫోటోలు తీయడానికి ప్రయత్నించిన జర్నలిస్టులపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీసులు కోర్టుకు ప్రవేశపెట్టిన అనుమానితులను కోర్టులో కాకుండా జడ్జి తన ఛాంబర్‌లోకి పిలిపించి రహస్యంగా విచారించినట్లు సమాచారం.

పోలీసులు వేసిన పిటిషన్‌పై వారి అభిప్రాయం అడిగినట్లు తెలిసింది. కోర్టు ముందు అనుమానితులు వారి అభిప్రాయాన్ని తెలియజేశారు. వారి అభిప్రాయాన్ని తెలుసుకున్న కోర్టు సీల్డ్ కవర్లో నిర్ణయం పోలీసులకు తెలియజేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇదే విషయమై జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్‌బాబును వివరణ కోరగా వైష్ణవి హత్యకేసులో భాగంగా కుటుంబ సభ్యులను నార్కో అనాలసిస్ టెస్ట్ కొరకు కోర్టు అనుమతి కోసం వారిని హాజరుపరచడం జరిగిందని, కోర్టు నుండి సీల్డ్ కవర్ అనుమతి విషయాలు తెలుస్తాయన్నారు.

దస్తగిరిని బెదిరించిన ఘటనపై కడప సెంట్రల్ జైలులో విచారణ

కడప, ఆంధ్రప్రభ బ్యూరో: మాజీ మంత్రి వై.ఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరిని కడప కేంద్ర కారాగారంలో బెదిరించిన సంఘటనపై నలుగురి సభ్యుల బృందం మంగళవారం కడప సెంట్రల్ జైలులో విచారణ చేసింది. వివేకానంద రెడ్డి హత్య కేసులో ముద్దాయి అయిన దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్య రెడ్డి సెంట్రల్ జైలులో 2023 నవంబరు 28న వైద్యశిబిరం నిర్వహించారు. ఆసందర్భంగా అప్పటికే జైల్లో ఖైదీగా ఉన్న దస్తగిరిని ఆయన బెదిరించారనేది ప్రధాన అభియోగం. దస్తగిరి ఫిర్యాదు మేరకు కడప రిమ్స్ పోలీసులు అప్పట్లో డాక్టర్ చైతన్య రెడ్డిపై కేసు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బెదిరించిన ఘటనపై రాజమహేంద్రవరం జైలు అధికారి రాహుల్ జులై నెలలో విచారించి ప్రభుత్వానికి ఒక నివేదిక అందజేశారు. ఆ నివేదికపై మరింత లోతైన విచారణ చేపట్టేలా ప్రభుత్వం నలుగురితో కూడిన కమిటీని నియమించింది. ఆ కమిటీ మంగళవారం విచారణ చేపట్టింది. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, కడప జిల్లా వైద్య శాఖ అధికారి కె.నాగరాజు, విజయవాడ జిల్లా జైలు అధికారి మహమ్మద్ ఇర్ఫాన్, కడప ఆర్.డి.ఓ జాన్ ఇర్విన్‌లతో కూడిన కమిటీ నలుగురు సభ్యుల విచారణ బృందం ఆరోజు విధుల్లో ఉన్న జైలు సూపరింటెండెంట్, సిబ్బందినికర్నూలు ఎస్పీ ప్రశ్నించారు. ఆరోజు జైలులో ఏం జరిగింది?, నిజంగా వైద్య శిబిరం నిర్వహించారా?, ఏర్పాటు చేసి వుంటే ఎన్ని గంటల పాటు